

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67.00

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	19
తిరుపతి	34	19
తిరుమల	31	16
గూడూరు	34	21
నగరి	36	21



గరుడోత్సవం

రాపూరులోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి శనివారం చందనాలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. – రాపూరు

- ఆసక్తిరేపుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు
- మొదటి ప్రాధాన్యత ఓటుపై వైఎస్సార్‌సీపీ ధీమా
- ప్రచారంలో పత్తాలేని టీడీపీ
- నం.2 కోసం లెఫ్ట్ పార్టీతో కుమ్మక్కు
- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- రేపే ఓటింగ్
- సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం

ప్రగతికి మొదటి ప్రాధాన్యం

గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. ఎన్నికలు ఏవైనా.. అభ్యర్థులు ఎవరైనా విజయ ఢంకా మోగిస్తోంది. ఈకోవలోనే గత నాలుగేళ్లుగా ప్రతి ఎన్నికల్లోనూ క్లీన్‌స్వీప్ దిశగా పయనించింది. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే ఊపుతో ప్రచారాన్ని ముగించింది. ఇచ్చిన హామీలు అమలు చేశామని, అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా అమలు చేస్తున్నామని, 'పెద్ద'మనసుతో తమ పార్టీ బలపరచిన అభ్యర్థులకు 'మొదటి ప్రాధాన్యత' ఇచ్చి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థిస్తోంది. కానీ టీడీపీ దొంగ నాటకాలాడుతూ ఓటర్లనే కాదు ఆ పార్టీ తరఫున పోటీలో ఉన్న అభ్యర్థులను సైతం గందరగోళంలోకి నెట్టేస్తోంది. తమను నమ్మి చేతులు కలిపిన లెఫ్ట్ పార్టీని అగాథంలో ముంచేసేందుకు సిద్ధమైంది.



సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్: ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రచారానికి టీడీపీ నేతలు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. వరుస ఓటములతో డీలాపడిన ఆ పార్టీ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లైట్ తీసుకున్నారు. అమరావతి నుంచి వచ్చిన ఆ పార్టీ పెద్దలను వెంటబెట్టుకుని ఒకటికి రెండు సార్లు ప్రచారానికి వెళ్లినా ఓటర్ల నుంచి స్పందన లేకపోవడంతో తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఈ నేపథ్యంలోనే ప్రెస్‌మీట్లకే పరిమితమవుతూ వైఎస్సార్‌సీపీని టార్గెట్ చేసి చిందులేయడం మొదలు పెట్టారు. ఇదిచాలదన్నట్టు తమ పార్టీ అధినేత చంద్రబాబు సూచనలతో దొంగ ఓట్ల డ్రామాను తెరపైకి తెచ్చి నాటకాన్ని రక్తికట్టించాలని భావించారు. దీన్నే ప్రధాన ప్రచార అస్త్రంగా మలుచుకుని ఎల్లో మీడియా ద్వారా విషప్రచారానికి తెర లేపారు. అది కూడా ఆశించిన ఫలితం ఇవ్వకపోవడంతో చివరకు లెఫ్ట్ పార్టీతో చేతులు కలిపి రెండో ప్రాధాన్యత ఓటు వేయాలంటూ ఓటర్ల చుట్టూ ప్రదక్షిణ చేయడం ప్రారంభించారు. ఒకవేళ వామపక్ష అభ్యర్థి గెలిస్తే దాన్ని తమ ఖాతాలో వేసుకోవచ్చని భావించి ఆ పార్టీతో చేతులు కలిపినట్టు తెలుస్తోంది.

డబుల్..ట్రబుల్

ఒక వైపు లెఫ్ట్ పార్టీ అభ్యర్థులకు రెండవ మద్దతు ఓటు వేయాలని చెబుతూనే.. మరో వైపు వామపక్ష పార్టీ అభ్యర్థులపై టీడీపీ నేతలు వ్యతిరేక ప్రచారం నిర్వహిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మొదటి ప్రాధాన్యత ఓటు టీడీపీ అభ్యర్థికి వేసి మిగిలిన రెండో ప్రాధాన్యత ఓటు మీ ఇష్టమొచ్చిన వారికి వేయండని ఓటర్లకు సూచిస్తుండడం కొసమెరుపు. దీనిపై తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ సైతం అధిష్టానంపై గుర్రుగా ఉన్నట్టు ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు.

మెజారిటీపై వైఎస్సార్‌సీపీ ధీమా

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోయారు. పార్టీ పిలుపుమేరకు రీజనల్ కో-ఆర్డినేటర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, అనుబంధ సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. విద్యాభివృద్ధికి, నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును ఓటర్లకు వివరించారు. పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి బ్యాలెట్ పేపర్‌లో రెండో నంబర్‌కు ఎదురుగా 1 సంఖ్య రాసి, టీచర్ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి బ్యాలెట్ పేపర్‌లో మూడుకు ఎదురుగా 1 సంఖ్య వేసి గెలిపించాలని సూచించారు.

ముగిసిన ప్రచార పర్వం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. సోమవారం జరుగబోవు ఎన్నికలకు ఆయా పార్టీ శ్రేణులు సమాయత్తం అవుతుంటే.. మరో వైపు అధికారయంత్రాంగం ఏర్పాట్లు చకచకా పూర్తి చేసింది. 13వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు.

పకడ్బందీగా ఇంటర్, పది పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హరి నారాయణన్ తెలిపారు. శనివారం అమరావతి సచివాలయం నుంచి చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు మొత్తం 31,576 మంది హాజరుకానున్నారని చెప్పారు.ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పదోతరగతి పరీక్షలకు 21,996 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ 18004257635 నంబర్ ఏర్పాటు చేశామని తెలిపారు.

స్వర్ణరథంపై వరసిద్ధుని విహారం


ఉత్సవర్లను తీసుకువస్తున్న ఆలయ అధికారులు


సంకటహర చతుర్థి వ్రతంలో భక్తులు


స్వర్ణ రథంపై ఊరేగుతున్న దేవదేవేరులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వారు సిద్ధి, బుద్ధి సమేతంగా శనివారం రాత్రి స్వర్ణ రథంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. సంకటహర చతుర్థి వ్రతం సందర్భంగా గణనాథుని రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఉదయం వినాయకస్వామికి ప్రత్యేక అభిషేకం జరిపించారు. అనంతరం ఆస్థాన మండపంలో ఉత్సవర్లను వేంచేపు చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు వ్రతం ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సతీ సమేతంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాల నడుమ స్వర్ణరథంలో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. సువర్ణ కాంతుల్లో దేదీప్యంగా దర్శనమిచ్చిన గణపతిని సేవించుకుని భక్తులు తన్మయత్వం పొందారు. కర్పూరహారతులు సమర్పించి పులకించారు. ఆలయ మాడ వీధులలో విహరించారు. ఉదయం ఆలయంలో సంకటహర చతర్థి వ్రతం సందర్భంగ స్వామివారు స్వర్ణ రథంలో మాడవీధులలో ఊరేగించడం ఆనవాయితీ. సాయంత్రం అలంకార మండపంలో ఆలయ అర్చకులు సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాలతో మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి స్వర్ణరథంలో కొలువు తీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి స్వర్ణ రథం ఆలయ మాడవీధులలో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, బాబు, వెస్ట్ సీఐ శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

కాణిపాకం ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వేకువనుంచే పెద్ద సంఖ్యల భక్తులు తరలిరావడంతో రూ.100, రూ.150, ఉచిత దర్శనం క్యూలతోపాటు, కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి.

గంజాయి విక్రయిస్తున్న దంపతుల అరెస్టు

చిత్తూరు అర్బన్: గంజాయి విక్రయిస్తున్న కేసులో చిత్తూరుకు చెందిన కుమారి (38), శివాజి (45) అనే భార్య భర్తను పోలీసులు అరెస్టుచేశారు. వన్‌టౌన్ సీఐ నరసింహరాజు కథనం మేరకు.. శుక్రవారం సాయంత్రం కట్టమంచి చెరువు-ఆర్టీసీ బస్టాండు వైపు పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన కుమారి, శివాజీ అనే దంపతుల వద్ద ఓ బ్యాగును తనిఖీచేశారు. అందులో 500 గ్రాముల గంజాయిని పొట్లాలుగా చుట్టి ఉంచారు. దీంతో నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. శనివారం మధ్యాహ్నం నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా.. 14 రోజుల రిమాండు విధించారు. దీంతో వీళ్లను చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

శాంతిపురం : రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు పట్టుబడినట్లు ఎస్‌ఐ మునస్వామి తెలిపారు. కుప్పం-కేజీఎఫ్ మార్గంలో గెసికపల్లె వద్ద తనఖీ నిర్వహిస్తుండగా కుప్పం మండలం పెద్దబంగారునత్తం గ్రామానికి చెందిన గణేష్ కారులో రూ.31,625 విలువైన మద్యం గుర్తించామన్నారు. మద్యం, కారును సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే శివరామపురానికి చెంది రాజశేఖర్ బైక్‌పై రూ.7,800 విలువై మద్యం తీసుకెళుతుండగా అరెస్ట్ చేసినట్లు వివరించారు.


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రెండు ద్విచక్రవాహనాల ఢీ: ఒకరి మృతి


ధ్వంసమైన స్కూటీ

వడమాలపేట : మండల పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. వివరాలు.. నగరికి చెందిన మహిళా కానిస్టేబుల్ నవీన తన తండ్రి రమేష్‌తో కలిసి స్కూటీపై రేణిగుంటకు బయలుదేరింది. బుచ్చినాయుడు కండ్రిగ మండలం నీర్పాకోట ఎస్టీ కాలనీకి చెందిన శివయ్య, పాపయ్య ఎదురుగా మరో బైక్‌పై రాంగ్‌రూట్‌లో వస్తూ నవీన వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శివయ్య (35) అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన నవీన, రమేష్‌ను తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన శివయ్య, పాపయ్య మద్యం సేవించినట్లు వెల్లడించారు.



